
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024



ఓటరు జాబితా రూపకల్పనపై దృష్టి



- షెడ్యూల్ ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- సెప్టెంబరు 6న ముసాయిదా జాబితా
- 21న వార్డుల వారీగా తుది జాబితా
- జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు... 2,240 వార్డులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లెల్లో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల చేయడంతో దసరా నాటికి ఎన్నికలు రావచ్చనే అంచనాలతో ఆశావాహులు సందడి చేస్తున్నారు. రిజర్వేషన్లలో మార్పులు ఎలా ఉన్నా పోటీకి సిద్ధమే అంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, స్వచ్ఛంద సామాజిక సేవకులు పోటీవైపు దృష్టి పెట్టారు. ఎన్నికల సంఘం సెప్టెంబరు 6న గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా జాబితాను జారీ చేయనుంది. దీనిపై 7వ తేదీ నుంచి 13 వరకు డీపీవోలు, ఎంపీడీవోలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. 19వ తేది లోగా అభ్యంతరాలను పరిష్కరించి 21న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. దీంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. ఈ నెల 29న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎన్ని కల జాబితాపై సెప్టెంబరు 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో జిల్లా, మం డల స్థాయిలో సమావేశాలు నిర్వ హించనున్నారు. రాష్ట్రఎన్నికల సంఘం 2019 సంవత్సరంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వ హించారు. ఈసారి కూడా మూడు విడతల్లోనే ఎన్నికలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎన్నికల సంఘం 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్‌ను ఏర్పాటు చేయడం, బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 600 మంది ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించే విధంగా సిబ్బంది వివరాలను సేకరించి టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు.

రిజర్వేషన్లపై ఆసక్తి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు విడతలుగా ఒకే రిజర్వేషన్ ఉండే విధంగా రూపొందించారు. 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేయడం ద్వారా 34 శాతం నుంచి 23 శాతానికి బీసీ రిజర్వేషన్ తగ్గించింది. దీనిపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 23 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 21 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. రిజర్వేషన్లలో గరిష్ట పరిమితి 50 శాతంలో 44 శాతం పోగా ఆరు శాతం మిగులుతుంది. దీనిని బీసీలకు కేటాయిస్తారని భావిస్తు న్నారు. ప్రస్తుతం జరుగుతున్న బీసీ సర్వే ప్రకారం రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయనే దానిపై చర్చ కొనసాగుతోంది.

● ఆశావాహుల దృష్టి..

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు 2240 వార్డులు ఉన్నాయి. గతంలో జిల్లాలో ఆరు సర్పంచ్ స్థానాలు, 82 వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికలు జరగకుండానే గడిచిపోయింది. ఇల్లంత కుంట మండలం గొల్లపల్లి గ్రామప ంచాయతీ ప్రజలు 2019లో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించారు. ఆ గ్రామ పంచాయతీకి ఎన్నికలు లేకుండానే గడిచి పోయింది. ఈ సారి ఎన్నికల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతోనే గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. తమకు అనుకూలంగా ఉండే విధంగా తమ వార్డుల్లో తమ కుటుంబసభ్యులు ఉండే విధంగా ఆశావాహులు దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే సాధారణ ఓటరు జాబితా రివిజన్ ఎన్నికల కొ వి ం ‘షన్ ప్రారంభించింది. 2025 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈనెల 20 నుంచి అక్టోబరు 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించనున్నారు. ఇందులో ఓటర్లను తమ వారిని చేర్పించడానికి ఆశావాహులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో ఓటరు జాబితాపైనే దృష్టి పెట్టారు.

● విలీన గ్రామాల్లో ఆందోళనలు...

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో గ్రామాలను విలీనం చేశారు. శాసనసభ ఎన్నికల సమయంలో విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీలు ఇచ్చారు. ఎనిమిది నెలలు అవుతున్నా విలీన గ్రామాలను పంచాయతీలుగా మార్చే ప్రక్రియపై ఎలాంటి చర్యలను మొదలు పెట్టలేదు. 2018లో సిరిసిల్ల మున్సిపాలిటీలో ఏడు గ్రామాలను విలీనం చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో పెద్దూర్, సర్దాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు, వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, అయ్యోరుపల్లి, కోనాయపల్లి, శాత్రాజుపల్లి, నాంపల్లిలను విలీనం చేశారు. ఈగ్రామాల్లోని ప్రజలు తిరిగి గ్రామ పంచాయతీలుగా చేయాలనే ఆందోళనలు ముందుకు వచ్చాయి. విలీనం గ్రామాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనే దానిపై చర్చ జరుగుతోంది. విలీనగ్రామాల ప్రజలు మాత్రం ఆందోళనలు కొనసాగించడానికి నిర్ణయించారు.


తండాల్లో తీజ్ వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు, మహిళలు

7

రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి



వేములవాడలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

8

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఇల్లంతకుంట, ఆగస్టు 22: మండలంలోని తొమ్మిది మంది పంచాయితీ కార్యదర్శులను బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో వంతడుపులలో పనిచేస్తున్న సరస్వతిని రేపాకకు, ముస్కానిపేటలో పనిచేస్తున్న అనీల్‌ను గాలిపల్లికి, రేపాకలో పనిచేస్తున్న రాజయ్యను ముస్కానిపేటకు గాలిపల్లిలో పనిచేస్తున్న అరుణను వంతడుపులకు బదిలీ చేశారు. కందికట్కూర్‌లో పనిచేస్తున్న వరుణ్‌ను ఇల్లంతకుంటకు, ఇల్లంతకుంటలో పనిచేస్తున్న రమేష్‌ను చిక్కుడువానిపల్లెకు జవారిపేటలో పనిచేస్తున్న మధును జంగమరెడ్డిపల్లెకు, చిక్కుడువానిపల్లెలో పనిచేస్తున్న రంజిత్‌ను కందికట్కూర్‌కు, జంగమరెడ్డిపల్లెలో పనిచేస్తున్న జనార్దన్‌ను జవారిపేటకు బదిలీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 22: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో ఈ నెల 23న మరమ్మత్తులు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని 'సెస్' ఏఈ పృథ్వీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్, గుండారం గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని 'సెస్' ఏఈ పృథ్వీధర్ కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు
జిల్లా కన్వీనర్‌గా మల్లారపు సంతోష్‌రెడ్డి

ముస్తాబాద్, అగస్టు 22: బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్‌గా ముస్తాబాద్ మండలానికి చెందిన మల్లారపు సంతోష్‌రెడ్డిని నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉత్వర్వులు జారీ చేశారు. వీరితోపాటు కో కన్వీనర్లుగా సిరికొండ శ్రీనివాస్, మిరియాల్కార్ బాలాజీ, బర్కం లక్ష్మిలను నియమించారు. తనపై నమ్మకంతో జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్‌గా నియమించినందుకు పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. రానున్న రోజుల్లో పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలబెడతానని అన్నారు.





మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పాల్గొన్న పోలీస్ అధికారులు

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం

- గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలు ఉపయోగిస్తే చర్యలు - ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరాల నియంత్రణలో భాగంగా నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకై కృషిచేయాలన్నారు. గ్రామ, మండల, పట్టణ కేంద్రాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పండుగలు, వివిధ జాతర సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలన్నారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఉపయోగిస్తే కేసులు నమోదుచేసి సీజ్ చేయాలన్నారు. వివిధ కారణాలతో రోడ్లమీదకు వచ్చి రాస్తారోకో, ధర్నాల పేరుతో ప్రజా రవాణాకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించా లన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, గుడుంబా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ రైస్‌లపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటుచేసి మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై, నిబంధనలకు విరుద్ధంగా సైరన్ ఉపయోగించే వాహనాలపై దృష్టి పెట్టాలన్నారు. నేరాల నియంత్రణలో గ్రామ పోలీస్ అధికారి కీలకపాత్ర పోషించాలన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను బలోపేతం చేసి సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో హిస్టరీ, రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలి గించేవారిపై నిఘా ఏర్పాటుచేసి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలన్నారు. ఫిర్యాదు స్వీకరణ నుంచి కేసు నమోదు, చార్జీ షీట్ వరకు కులంకషంగా పరిశోధన చేసి కోర్టుల్లో నిందితు లకు శిక్షలు పడే విధంగా అధికారులు, సిబ్బంది కృషిచేయాల న్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, మురళికృష్ణ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 22: చట్టాలపై విద్యార్థి దశనుంచే అవగాహన కలిగి ఉండాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి ముందుగా పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులకు తయారు చేసిన భోజనాలను పరిశీలించి రుచి చూశారు. అనంతరం జరిగిన సదస్సులో విద్యార్థులతో మాట్లాడి విద్యా విధానంతో పాటు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాధికా జైస్వాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులతో పాటు మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని పూర్తిగా తెలుసుకుంటే సమాజంలో జరిగే అరాచకాలను ఎదుర్కోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ కీసరి శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు అడెపు వేణు, డిప్యూటీ చీఫ్ లీగల్ హెడ్ కౌన్సిల్ మెంబర్ మల్లేష్‌యాదవ్, న్యాయవాది కుంట శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్

గంజి వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - బోయినపల్లి జడ్పీ స్కూల్ భవనం, పీహెచ్‌సీ తనిఖీ

బోయినపల్లి, ఆగస్టు 22: బోయి నపల్లి నుంచి వేముల వాడ రోడ్డులో గంజి వాగు పై బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారు లను కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ఆదేశించారు. గంజి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు ఎక్కడి దాకా పూర్తి అయ్యాయో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి నేరుగా బోయినపల్లిలోనిజిల్లా పరిషత్ పాఠశాల భవనంలో తరగతి గదులు, టాయిలెట్స్ తదితర పనులు పరిశీలించి, కావాల్సిన మరమ్మతులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డీఈఓ రమేష్ కుమార్‌ను ఆదేశించారు. నూతన విద్యాలయాన్ని అక్కడికి తరలించి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రక్త పరీక్షల గది, ఫార్మసీ గది, లేబర్ రూం పరిశీలించారు. అనంతరం ఓపీ రిజిస్టర్ తనిఖీ చేసి, ఎంత మంది రోగులు వచ్చారు? ఎందరికి రక్త పరీక్షలు చేశారని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల వరకు 11 మంది రాగా, ఒకరికి రక్తపరీక్ష చేసినట్లు కలెక్టర్ దృష్టికి డాక్టర్ తీసుకెళ్లారు. మందులు, టెస్ట్ కిట్లు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో వినోద్, ఎంపీడీవో జయశీల, వైద్యాధికారి రేణుక, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను
లక్ష్యం మేరకు పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 22: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, వాటిని ఏ విధానంలో పూర్తి చేయడం, యాప్‌లో వివరాల నమోదుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లాలోని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి మొత్తం కలిపి 42,941 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తుల స్ర్కూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి సేకరించాలని, జిల్లాలో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి, యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే నంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీల్లో బృందాలు పరిశీలన చేసి జీపీఎస్ ద్వారా సదరు భూమి కో-ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేయాలని వివరించారు. రెగ్యులర్ చేసే భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్ పరిధిలోవి కావని ధ్రువీకరించాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల భూముల వివరాలు అందరి వద్ద సమాచారం ఉండాలని స్పష్టం చేశారు. నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్, మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీపీవో అన్సారీ, రూరల్ నోడల్ ఆఫీసర్, వీటీడీఏ సీపీవో రాజ్‌కుమార్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, అన్వేష్, రెవెన్యూ అధికారులు, ఎంపీవోలు, ఇరిగేషన్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నోటు బుక్‌ల పంపిణీ



నోటు బుక్కులను పంపిణీ చేస్తున్న ఏజెంట్లు

సిరిసిల్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యెల్లె రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నోటు బుక్కులు, పెన్నులను అందజేశారు. గురువారం సిరిసిల్ల పాతబస్టాండ్‌లోని న్యూస్‌పేపర్ స్టాల్ వద్ద పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రౌడ్ ఆఫ్ జోగాపూర్ వ్యవస్థాపకుడు గాజుల నరేష్‌తో పాటు యూనియన్ ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రాజు, సీనియర్ ఏజెంట్లు యెల్లె శ్రీనివాస్, రాగు వేణుగోపాల్, నక్క వెంకటేష్, చిట్యాల శ్రీహరి, రవీందర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు

తంగళ్లపల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలోని ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. గురువారం తంగళ్లపల్లి మానేరు నది నుంచి ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో తరలిస్తుండగా మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇసుక అనుమతి పత్రాలతో పాటు క్వాంటిటీ తదితర అంశాలను మైనింగ్ అధికారి సైదులు పరిశీలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: కరీంనగర్ అశోక్‌నగర్‌లో బుధవారం వేకువ జామున జరిగిన హత్య కేసులో నిందితుడు మీర్జా ఇబ్రహీం బేగ్ అలియాస్ మీర్జా సుఫియాన్ బేగ్(20)ని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. మద్యం విషయంలో గొడవ పడి అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్(32)పై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో నిందితుడు సుఫియాన్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా మలేరియా వైద్యాధికారి

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా వైద్యాధికారి ఉమాశ్రీరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన జ్వరంతో బాధపడుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాడికల్‌లో జ్వరాల బారిన పడిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి రోగ లక్షణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణల పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



క్షేత్ర స్థాయి పర్యటనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 22: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ బృందం ఆధ్వర్యంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. పత్తిలో ఆకు మచ్చ తెగులు, పిండినల్లి, రసం పీల్చే పురుగుల ఉధృతిని గుర్తించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపీకోనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లొప్రైడ్ 0.3మిల్లీటీటరు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నివారణకు ప్రోఫెనోపాస్ 3 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. వరిలో జింక్ లోపానికి 2గ్రా. జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో ఆకుమాడు తెగులు నివారణకు ప్రోపి కోనజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు గోన్యానాయక్, బలరాం, రవి, శ్వేత, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన బస్సు

- బయటకు నెట్టిన నాయకులు


బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

వీర్నపల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షాలకు ప్రధాన రహదారి బురదమయంగా మారింది. రోడ్డంతా బురదతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వన్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో దిగబడిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సులో నుంచి దిగారు. అక్కడే రైతు ధర్నా పాల్గొనేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు బస్సును వెనకనుంచి నెడుతూ బురదలో నుంచి బయటకు తీశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోమండల ప్రజలు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాపట్టించుకునే వారు లేరని వాపోయారు.

తండాల్లో తీజ్ వేడుకలు


బావ్‌సింగ్‌నాయక్ తండాలో తీజ్ వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

వీర్నపల్లి, ఆగస్టు 22: పలు తండాల్లో గురువారం తీజ్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో గిరిజన యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలోని బావ్ సింగ్ నాయక్ తండా, మద్దిమల్ల తండా, భూక్యతండా, జవహర్లాల్ నాయక్ తండా గ్రామాలతో పాటు పలు తండాల్లో గిరిజనులు తీజ్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ మాట్లాడుతూ తండాల్లో పెళ్లికాని ఆడపడుచులు పందిరి వేసి బుట్టలలో ఆవు ఎరువు వేసి నవధాన్యాలను నానబెట్టడం సాంప్రదాయమన్నారు. మొలకెత్తిన నారు బుట్టలకు ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం గిరిజనులు డప్పు చప్పుళ్ల మధ్య సాంప్రదాయ నృత్యాలతో నిమజ్జనం చేస్తారన్నారు. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, ఆయా తండాల్లో తండా నాయక్‌లు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా, తిమ్మాపూర్ తండా, గుంటపల్లిచెరువు తండాల్లో గురువారం సాయంత్రం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పందిరిని ఏర్పాటు చేసి గిరిజన యువతులు వారం రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గోధుమ బుట్టల్లో నీరు పోశారు. చివరి రోజున గోధుమ బుట్టలను పందిరి నుంచి తీసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. సాంప్రదాయ పాటల మధ్య నృత్యాలు చేశారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ సర్పంచులు రజిత, ప్రభునాయక్, తండా పెద్దలు తిరుపతినాయక్, సీత్యానాయక్, సూర్యనాయక్, హరిదాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.


బుగ్గరాజేశ్వరతండాలో గోధుమనారు బుట్టలతో యువతులు

క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న దీపక్ జాన్ రాజ్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ రాజ్ అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా పాస్టర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దీపక్ జాన్ రాజ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో మైనారిటీ విద్యార్థుల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఉచిత స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ హాస్టళ్లలో వసతిని అందిస్తున్నామని అన్నారు. క్రైస్తవుల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక భేటీ అనంతరం తదుపరి కార్యాచరణను తెలియజేస్తామని అన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు కొంతమంది న్యాయవాదులచే ఓ కమిటీని ఏర్పాటు చేసి దురాగతాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. క్రైస్తవ సమాజానికి ఒక నిధిని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. సిఎస్ఐటీఏ ఆల్ ఇండియా బెన్ని షరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి కృపాదానం మాట్లాడుతూ గ్రామీణ యువతీ యువకులకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కింద ఉపాధి అవకాశాల విషయంలో స్పందించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన కార్యక్రమం కింద స్టడీ సర్కిళ్ళు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం క్రిష్టఫర్, కార్యదర్శి ఏ సురేశ్, విపిఎస్ బాల నాయక్, ప్రేంకుమార్, పాలు ముస్తఫా, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త, ప్రసాద్, పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాలు, కార్యదర్శి సిహెచ్ దేవదాసు, ఓ పవన్, అశోక్, శ్యామ్, రాజు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు

రోడ్డుపైనే ఆర్టీసీ బస్సును నిలిపివేసిన డ్రైవర్

హుజూరాబాద్, ఆగస్టు 22: పరిమితికి మించి ప్రయాణికులు బస్సు ఎక్కారని, తాను నడపలేనంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై బస్సును నిలిపివేశాడు. వివరాలిలా ఉన్నాయి. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం వరంగల్‌కు వెళ్తూ మధ్యలో ఉండే హుజూరాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణికులు బస్సులో ఎక్కారు. ఓవర్ లోడ్ అవుతుందని, బస్సును నడిపే పరిస్థితి ఉండదని డ్రైవర్ ఎంత చెప్పినా ప్రయాణికులు వినిపించుకోలేదు. బస్సును కిలోమీటర్ నడిపిన డ్రైవర్ ఇక నడపడం తన వల్ల కాదని చెప్పి రోడ్డుపై నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. రియర్ వ్యూ మిర్రర్ నుంచి ఇతర వాహనాలు తనకు కనిపించడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే తనను బాధ్యుడిని చేస్తారని, తాను బస్సు నడపలేనని ప్రయాణికులకు చెప్పాడు. బస్సులోని ప్రయాణికులు తనకు సహకరించి దిగి పోవాలని అభ్యర్థించాడు. దీంతో కొంత మంది ప్రయాణికులు డ్రైవర్ చెప్పిన విషయాన్ని గమనించి బస్సు దిగిపోయారు. దీంతో యథావిధిగా బస్సు వరంగల్‌కు వెళ్లిపోయింది. గురువారం పెళ్లిళ్లు ఉండడంతో బస్సులో రద్దీ ఎక్కువగా ఉంది.



హుజూరాబాద్‌లో రోడ్డుపై నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి
కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 9064 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,994, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5072 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 433 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీలోకి 4,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 4,472 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 22: లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17.6 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ చిరువ్యాపారి మృతి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లికి చెందిన ఎండి ఖాజా (55) అనే చిరువ్యాపారి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

మానకొండూర్, ఆగస్టు 22: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ (33) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి గురువారం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రవీణ్ గతంలో కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ చిట్‌ఫండ్‌లో ఉద్యోగం చేస్తూ అప్పులు చేయగా వాటిని తీర్చేందుకు తన తండ్రికి చెందిన భూమివాటాను అమ్మి అప్పులు చెల్లించిన తీరలేదు. అప్పుల బాధ భరించలేక ఈ నెల 17న రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా మృతుని తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, ఆగస్టు 22: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మజ్జిగ కొంరయ్య(90) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంరయ్య కుమారుడు బీరయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి, ఆగస్టు 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమండ్ల తిరుపతి(50) కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆరు నెలల క్రితం యాక్సిడెంట్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నాడు. దీంతో ఇంటి వద్ద భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెందిన తిరుపతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయబావిలో జారిపడి
మహిళా రైతు మృతి


సంతోషి మృతదేహం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: సిరిసిల్ల పట్టణం ముష్టిపల్లి గ్రామానికి చెందిన చీమ సంతోషి(26) అనే మహిళా రైతు గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో జారిపడి మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన సంతోషి వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బావిలో నీళ్లు ఉన్నాయని గడ్డపై నుంచి చూస్తుండగా గడ్డి జారీ బావిలో పడింది. ప్రమాదవశాత్తు బావిలో పడుతుండగా పక్కనే మరోమహిళా రైతు ఉంది. వెంటనే చూసిన ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి బావిలో పడిన మహిళా రైతును పైకి తీసి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త మహేశ్ ఉపాధి కోసం నెలరోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని దివ్యాంగుడు..

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్ రైల్వే స్టేషన్, 35వ, రైల్వే గేటు మధ్యలో గుర్తుతెలియని దివ్యాంగుడు రైలు నుంచి పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా తెలియడం లేదు. దీంతో మృతదేహం చీమలు, కుక్కల పాలవుతోందని రైల్వే కార్మికులు విలేకరులకు తెలిపారు. గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దివ్యంగుడైన ఈ వ్యక్తి బూడిద కలర్‌షర్ట్ గీతాల డబ్బాలతో ఉన్న చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రైలు నుంచి పడి మృతిచెంది ఉంటాడని కొలనురు గ్రామస్తులు తెలిపారు. వెంటనే జీఆర్‌పీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య ఘటనపై సీఐ విచారణ


కొలనూర్‌లో విచారణ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్‌లో బుధవారం రాత్రి జరిగిన మాటూరి విజయ్ హత్య స్థలం వద్ద గురువారం సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐల బృందం సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. బుధవారం రాత్రి మద్యం బెల్టు షాపులో ఒక వ్యక్తితో గొడవ జరగగా బయటకు వచ్చిన తర్వాత ప్రణాళికంగా హత్య జరిగిన తీరుపై సీఐ దర్యాప్తు నిర్వహించారు. అక్కడున్న నెత్తుటి నమూనాలను, హత్య జరిగిన తీరుపై నిందితుడితో జరిగిన వాగ్వాదంపై అక్కడి బెల్టుషాప్ యజమానిని విచారించారు. సిఐ వెంట ఎస్సైలు శ్రీధర్, నరేష్ కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి ఆరెల్లి సారయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం కాలినడకన పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో కేశవపట్నం వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఎడమ కాలు విరిగింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 205క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర 6,900 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడు మృతి

- నిశ్చితార్థానికి కొద్ది గంటల ముందే మృత్యువాత


సాధిక్(ఫైల్)

కథలాపూర్, ఆగస్టు 22: మరి కొద్ది గంటల్లోనే నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు అతివేగంగా బైక్ నడిపి చెట్టుకు ఢీకొట్టి మృత్యువాత పడ్డ ఘటన పోసానిపేటలో విషాదం నింపింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... సాధిక్ (29) అనే యువకుడు ఏడు సంవత్సరాల అనంతరం ఈ నెల 11న దుబాయి నుంచి వచ్చాడు. సాధిక్ బుధవారం సాయంత్రం తాండ్ర్యాలకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము దాకా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రోడ్డు వెంట వెతుకుతూ వెళ్లారు. పోసానిపేట ఎల్లమ్మ శివారులో చెట్టుకు ఢీకొట్టుకుని పక్కనే ఉన్న గోతిలో శవమై కనిపించాడు. సాధిక్‌కు గురువారమే వరపూజ ఉండగా అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి అన్న అన్వర్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సింగరేణి కార్మికుడి మృతి

- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి' కథనం


పొత్కపల్లి మూల మలుపు వద్ద ఢీకొన్న వాహనాలు, (ఇన్‌సెట్‌లో మృతి చెందిన రంజిత్‌కుమార్(ఫైల్))

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లి చెరువు మూలమలుపు వద్ద గురువారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీకి చెందిన పెంద్రు రంజిత్ కుమార్ అలియాస్ రఘు(39) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. అత్తగారి గ్రామమైన జీలకుంటలో తన కొడుకు బారసాల ఉండగా మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంతో వస్తుండగా, జమ్మికుంట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రంజిత్ కుమార్ తీవ్ర గాయాలకు గురికాగా సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇప్పటివరకు పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా, ఈనెల 13న, పొత్కపల్లి చెరువు మూలమలుపుపై 'ఆంధ్రజ్యోతి'లో మూలమలుపు వద్ద పొంచి ఉన్న ముప్పు అనే కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదం సంభవించి తన కొడుకును కళ్లారా చూసుకోక ముందే సింగరేణి కార్మికుడు దుర్మరణం చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గన్నేరువరం, ఆగస్టు 22: మండల కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి(60) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి ద్విచక్రవాహనం (ఏపీ15ఏ25560)పై సోమవారం గన్నేరువరం వచ్చి వెళుతున్న క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎదురుగా గన్నేరువరం గ్రామానికి చెందిన బుర్ర రాజ్‌కోటి బైక్ (టీఎస్02ఈబి7263) ఢీకొట్టినట్లు ఎల్లస్వామి కూతురు వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బుర్ర రాజ్‌కోటి తహసీల్దారు కార్యాలయం ఎదుట తన బైక్‌ను రోడ్డు పక్కన పెట్టుకుని ఉండగా మైలారం గ్రామస్థుడు కాదసి ఎల్లస్వామి తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎల్లస్వామికి తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీజీఎం

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ జరుగుతున్న రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారంలు, స్టేషన్‌ను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి నిజామాబాద్, కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ సెక్షనలలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఉపాధ్యక్షుడు అజయ్ క్రాంతి సింగ్, కమిటీ సభ్యుడు దేవి సింగ్ ఠాకూర్ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి- కరీంనగర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నిజామాబాదు వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపడాలని, కరీంనగర్ నుంచి సికింద్రాబాద్‌కు వందే మెట్రో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, నిజామాబాదు నుంచి వరంగల్‌కు మెము ఎక్స్‌ప్రెస్ పుష్ పుల్ రైలు వయా పెద్దపల్లి మీదుగా నడపాలని, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక రైళ్లను పునరుద్ధరించడంతో పాటు వాటిని వారానికి మూడు రోజులు పెంచాలని కోరారు. పెద్దపల్లి, బల్లార్షా మీదుగా కోల్‌కతాకు నూతన రైలు సర్వీసు నడపాలని, పూర్వ నాగపూర్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించి చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.


డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, ఆగస్టు 22: పట్టణంలోని అతి పురాతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో శ్రీలక్ష్మీదేవి, విష్వక్సేన, ఆంజనేయ, ద్వార పాలక రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు చక్రపాణి మాధవాచార్య, చక్రపాణి నరసింహమూర్తి, బీర్నంది నరసింహచారి మంత్రోచ్చారణ మధ్య సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్, కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి - ప్రభాకర్, ఎంబేరి నాగభూషణం, పెండం గణేష్, ఆడెపు కమల - మధు, దేవాలయ ఈవో విక్రం, సీనియర్ అసిస్టెంట్ నర్సయ్య, నాయకులు జక్కుల ప్రసాద్, కొత్త సురేష్, గంధ్ర అజేందర్‌రావు, జుబర్తి రమేశ్, వేంకటేశ్వర భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు


గణపతి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. సకల కష్టాలు తొలగిపోవాలని కోరుతూ అర్చకులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకుల ధర్నా, రాస్తారోకో

సిరిసిల్ల రూరల్, అగస్టు 22 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీని రైతులందరికి పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గుడూరి ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీకి నాయకులు రైతులతో కలిసి సిరిసిల్ల -వేములవాడ ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోవడంతో పోలీసులు ప్రధానరోడ్డుపై బైఠాయించిన నాయకులను బలవంతంగా రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో రైతులను సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఇప్పట్టికైనా రూ 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచే శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, బొల్లి రాంమోహన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ 2 లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రైతు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు జిల్లా ఉపాధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, 'సెస్' డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, మల్లారెడ్డి, సుధాకర్‌రావు, వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్, సత్తయ్య, మధు, జబ్బార్, మజీద్, అఫ్సరున్నీసా పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని మానేరు వంతెనపై బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు బండి దేవదాస్, కోడూరు భాస్కర్ గౌడ్, పడిగెల రాజు, పడిగెల మానస, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, కోడి అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కామారెడ్డి, సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసిల్ ఆఫీస్ ఎదుట బైఠాయించి రైతు రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంజాడపు రాజు పట్టణ అధ్యక్షుడు పెదవేణి వెంకటి, మాజీ మార్కెట్ చైర్మన్ హనుమంతరెడ్డి, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజారాం, రైతులు పాల్గొన్నారు.





వీర్నపల్లి, ముస్తాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వీర్నపల్లి: రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులందరూ గద్దె దించాలని మాజీ జడ్పీటీసీ గుగులోత్ కళావతి సురేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రైతులతో కలిసి గురువారం రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, యూత్ మండల అధ్యక్షుడు దేవరాజు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీరాం నాయక్, మాజీ ఉపసర్పంచ్‌లు బోయిని రవి, రామస్వామి, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ కూడలిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు తెలంగాణ తల్లిని అవమానపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ విష యంలో ఇచ్చిన మాట తప్పారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరత్ రావు, అక్క రాజు శ్రీనివాస్ మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, పట్టణ అధ్యక్షుడు వద్దండి నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

వేములవాడ: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం నాడు వేములవాడలోని తెలంగాణచౌక్ వద్ద నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ రైతులందరికీ వర్తింప చేయకపోవడం బాధాకరమని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. రకరకాల నిబంధనల పేరిట సాకులు చెబుతూ రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఆయన ఆరోపించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెప్పే దానికి చేసే దానికి పొంతనలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు బండ నర్సయ్య, తిరుపతి రెడ్డి, రామ్మోహన్ రావు, కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, నరాల శేఖర్, జోగిని శంకర్, మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, మేకల ఎల్లయ్య, గోస్కుల రవి, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



గంభీరావుపేటలో..

19 అడుగులకు చేరిన ఎగువ మానేరు నీటిమట్టం



నిండుకుండలా ఎగువ మానేర జలాశయం

గంభీరావుపేట ఆగస్టు 22 : మండలంలోని నర్మాల ఎగువ మానేరు నీటిమట్టం 19 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వెల్లి, పాల్వంచ వాగులు ప్రవహిస్తున్నాయి. ఎగువ మానేరు ప్రాజెక్టుకు జీవనాధారమైన వాగులు ప్రవహిస్తుండడంతో క్రమంగా మానేరు జలాశయం నీటిమట్టం పెరుగుతోంది. పాల్వంచ, కూడవెల్లి వాగుల నుంచి వరదనీరు వస్తుండడంతో మానేరు నీటిమట్టం గురువారం నాటికి 19 అడుగులకు చేరింది. వరద ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే మానేరు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 31 అడుగుల సామర్థ్యం ఉన్న మానేరులో ప్రస్తుతం 19 అడుగుల నీరు ఉంది.

'అన్నపూర్ణ'లో 2.70టీఎంసీల నీరు..

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలను నిలిపివేశారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.70టీఎంసీల నీరు చేరుకుంది.

ఏబీసీడీ వర్గీకరణపై రివ్యూ పిటిషన్ వేయాలి



కలెక్టరేట్‌కు ర్యాలీ వస్తున్న మాలమహానాడు నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 22: ఏబీసీడీ వర్గకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం లోని ఎన్‌డీఏ ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్‌ను వేయాలని మాలమహానాడు అఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి డిమాండ్ చేశారు. సిరిసిల్ల కలెక్టరేట్‌కు గురువారం మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అధ్వర్యంలో రగుడు అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా తరలివచ్చిన నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పసుల రాంమూర్తి మాట్లాడుతూ ఎస్సీలకు రిజర్వేషన్‌లు ఇచ్చింది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాత్రమేనని ప్రధాన మంత్రి మోదీ కాదన్నారు. కలిసి ఉండమని చెప్పిన అంబేద్కర్‌ను కాదని మోదీ విభజన చేయడం ఎలా సాధ్యమని మండిపడ్డారు. దేశంలో మోదీ నిరంకుశపాలనను అంతం చేయాలన్నారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందని ఎస్సీ వర్గీకరణ బిల్లును సుప్రీంకోర్టులో ఎలా సాధ్యం అవుతుందన్నారు. కేంద్రం తప్పిదం తెలుసుకోని ఎస్సీ వర్గీకరణ తీర్పు తప్పు అని రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ మనువాదుల ఏజెంటుగా మారాడా న్నారు. క్రిమిలేయర్ అమలు జరిగితే మంద కృష్ణను మాదిగలే రాళ్లతో కొడుతార న్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బోలుమాల శంకర్, జిల్లా కమిటీ నాయకులు తుంగ శివరాజ్, సిరిగిరి రమేష్, గుంటి వేణు, వంకాల భూమయ్య, జంగం అంజన్న, జక్కుల రామచంద్రం, ర్యాకం రాజేష్, సిరిగిరి వెంకటేష్, కాగిత బాలయ్య, లింగంరాణి, మాస బాలయ్య, ఎర్రబెల్లి రాజయ్య, రెడ్డిమల్ల సత్యనారాయణ, కోప్పు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ తల్లిని అవమానించిన సీఎం'

సిరిసిల్ల టౌన్/తంగళ్లపల్లి ఆగస్టు 22: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లిని అవమానించారని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం కొత్తబస్టాండ్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలంటూ నాయకులు నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఆడగట్ల మురళి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి పాల్గొన్నారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

మెస్‌లో వంటకాలను తిన్న కోతులు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

తంగళ్లపల్లి, ఆగస్టు 22: మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలోని మెస్‌లో కోతులు వంటకాలు తింటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మెస్ నిర్వహణ బాగాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో ఆరోపించిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా గురువారం మెస్‌లో వండిన వంటకాలను కోతి తింటున్న వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇకనైనా మెస్ నిర్వాహకులు నిర్లక్ష్యం వదిలి విద్యార్థులకు సరైన ఆహారాన్ని అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



మెస్‌లో అన్నం తింటున్న కోతి

ఈ విషయంపై వివరణ కోసం కళాశాల డీన్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ లైన్ కలవలేదు.

సంక్షిప్త సమాచారం

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణం చంద్రంపేట క్రాస్‌రోడ్డులో కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

- ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన మ్యాన శ్రీనివాస్ కాలు విరగగా, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన ఆవునూరి రాజు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. పరిస్థితి విషమించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ఎల్లారెడ్డిపేట: తన కారులో నుంచి టేపు రికార్డర్‌తో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని పేర్కొంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి శ్రీనివాస్ గురువారం తెలిపారు.

వేములవాడ: ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా గురువారం నాడు వేములవాడలో ఆయన అభిమానులు రక్తదానం చేశారు. మెగా అభిమాని దుర్శెట్టి అరుణ్ తేజ చారి, బొజ్జ సోజన్, బాణాల గోపి, మామిడాల విజయ్ రక్తదానం చేసి చిరంజీవి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు ఎనగల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు లాండే తిరుపతి ఉచిత బస్సు పాసులను అందజేశారు. పాఠశాలలోని 12 మంది విద్యార్థులకు గురువారం నాడు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్ సుచరిత, ఉపాధ్యాయులు ఎస్ శారద, మరియు ఆర్పీసీ సిబ్బంది రవీందర్, పురుషోత్తం పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థి గొల్లపల్లి గణేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా చిన్ననాటి మిత్రులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

- చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన గడ్డం సుధీర్ ఆర్డబ్ల్యూఎస్‌లో ఏఈఈగా ఎంపిక కాగా గ్రామస్తులు, మాజీ సర్పంచ్‌లు అంబిరి కల్పన-నరేష్, కొమ్ము రమేష్, నాయకులు ఎండి ఇస్మాయిల్, గంగారెడ్డి గ్రామపంచాయతీ ఎదుట శాలువాతో సత్కరించారు.

రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి జయంతి వేడుకలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 22: రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలో రాజ బహదూర్ వెంకట్‌రాంరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకట్‌రాంరెడ్డి చిత్రపటానికి రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద రెడ్డి కుటుంబాలతో పాటు ఇతర సామాజిక వర్గాలకు వెంకట్‌రాం రెడ్డి సేవల ను అందించారని అన్నారు. తన ఆస్తులను త్యాగం చేసి విద్యార్థుల కోసం వసతి గృహాలను నిర్మించారని ఆయన ఆశయాల కోసం పాటుపడాలన్నారు. అనంతరం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, తల్లిదండ్రులను సన్మానించి పారితోషకాలను అందించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మ ద్దూరు రాంరెడ్డి, మాజీ కోర్ కమిటీ సభ్యులు పూర్మాణి రామలింగారెడ్డి, పా తూరి మహేందర్ రెడ్డి, బాణాపురం రంగారెడ్డి, పొన్నాల బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాలు, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.





ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లిలో వేడుకులు నిర్వహిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం, రెడ్డి ఎంప్లాయిస్ మరియు ప్రొఫెనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామీణ నిరుపేద విద్యార్థుల కోసం రెడ్డి సంక్షేమ హాస్టళ్లను స్థాపించి ఎందరో మందికి వెంకటరామరెడ్డి విద్యను అందించారని అన్నారు. అనంతరం విద్యలో అత్యంత ప్రతిభ, వ్యవసాయ రంగంలో రాణిస్తున్న విద్యార్థులు, రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు ఎడమల బాల్‌రెడ్డి, సిరిసిల్ల ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, జిల్లా రెడ్డి సంఘ ప్రచార కార్యదర్శి ఎడమల హనుమంతరెడ్డి, మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారాయణరెడ్డి, ఫ్రెండ్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, రెడ్డి సంఘ ప్రధాన కార్యదర్శి సందిరి సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శి ఆసాని బాల్‌లింగారెడ్డి, కోశాధికారి దోర్నాల జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దేశ భక్తి పోటీల్లో ప్రతిభ

ఇల్లంతకుంట, ఆగస్టు 22: ఆన్‌లైన్ దేశ భక్తి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆదర్శపాఠశాల విద్యార్థులను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శపాఠశాలలో చదువుతున్న కమల్ల లహరి బృందం, మల్లమారి ఆరాధ్య బృందం ఆన్‌లైన్ దేశభక్తి పాటల పోటీలలో ప్రతిభ కనబర్చారు. పోటీలను తెలంగాణ భాషాసాంస్కృతి కశాఖ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని అధ్యాపకులు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధూకర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, గైడ్ టీచర్ నిషాని మహేందర్, అధ్యాపకులు వేణు, షర్మిల, మురళీకృష్ణ, వెంకన్న, సురేష్, సాంబయ్య, విజయ్, కిరణ్, బాబు, మహేందర్, రేణుక, శివరాణి, జలజ, రజిత, నర్సయ్య, శ్రీనివాస్. జ్యోతి, విద్యార్థులు అభినందించారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 22: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సావనపెల్లి రాకేష్ కోరారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 25న జరిగే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రొఫెసర్ కాసీం తదితరులు హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల నాయకులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బిగుల్ల తిరుపతి, కృష్ణ, మల్లిఖార్జున్, సావనపెల్లి పర్శరాం, స్వామి,ల లింగయ్య, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్‌పై ఎస్పీకి కాంగ్రెస్ ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: ఓ యూట్యూబ్ చానల్‌పై కాంగ్రెస్ నాయకులు ఎస్పీ అఖిల్ మహాజన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ప్రధానులు ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధీపై ఈనెల 20న ఓ యూట్యూబ్ చానల్‌లో అసభ్య పదజాలంతో మాట్లాడి అగౌరవపరి చిన సంబంధిత చానల్ యాజమాన్యంపై, రంజిత్‌రెడ్డి అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విప్ తల్లిదండ్రులను దూషించడమే కాకుండా ఇష్టవచ్చిన పదజాలంతో మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, నాగం కుమార్, బింగి మహేశ్, ఫిరోజ్ పాష, శ్రీనివాస్‌గౌడ్; మధు, శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌కు ఘన నివాళి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ ఆమెకు సంఘీభావంగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి న్యాయవాదులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుంచి అంబేద్కర్ చౌరస్తావరకు న్యాయవాదులు కొవ్వొత్తులతో ర్యాలీగా వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌ను పాశవికంగా హత్యచేసిన నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్‌చేశారు. ర్యాలీలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

రుద్రంగి (చందుర్తి) ఆగస్టు 22: రుద్రంగి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నాయకులు పోలీసులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీ పథకంలో చాలా మంది అర్హులకు పథకం వర్తించలేదంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టింది. మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు రైతు రుణమాఫీలో లబ్ధిపొంది కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొనటాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు వాట్సాప్ గ్రూపులో ప్రశ్నించాడు. దీంతో తమను ఎందుకు లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెడుతున్నారని సదరు మాజీ ప్రజాప్రతినిధి భర్త దురుసు పదజాలంతో ఎదురు ప్రశ్న వేశాడు. దీంతో గొడవ మొదలైంది. మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో చర్చకు రావాలంటూ ఆయన సవాల్ చేశారు. ఆయన సవాల్ కు ప్రతిగా సాయంత్రం కాంగ్రెస్ శ్రేణులు ఇందిరాచౌక్ వద్దకు వచ్చారు. చౌరస్తా వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కాంగ్రెస్ నాయకులకు సర్ది చెప్పి పంపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆధునిక సాంకేతికతతో సహకార సంఘాలు అభివృద్ధి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 22: రాష్ట్రంలో సహకార సంఘాలు ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చెందుతున్నాయని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్లు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి చెందేందుకు సహకారం సంఘాలు పని చేస్తున్నాయని అన్నారు. రైతులు సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సకాలంలో చెల్లించి సంఘం మనుగడకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్తయ్య, డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌ను కలిసిన ముస్లిం కమిటీ సభ్యులు



అజ్మతుల్లా హుస్సేన్ తో వేములవాడ ముస్లిం కమిటీ సభ్యులు

వేములవాడ, ఆగస్టు 22: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్, సభ్యులు గురువారం హైదరాబాదులోని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో అజ్మతుల్లా హుస్సేన్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని వక్ఫ్ భూములు అన్యక్రాంతం అవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని వక్ఫ్ భూములను సర్వే చేయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కలెక్టర్‌తో చర్చించి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయిస్తామన్నారు. బషీర్, కలీం పాషా, షేక్ రియాజ్ తదితరులు అజ్మతుల్లా హుస్సేన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

వేములవాడ టౌన్, ఆగస్టు 22: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి అన్నారు. వేములవాడ పట్టణంలోని నృత్య కళానికేతన్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోశెట్టి మాట్లాడుతూ 33 జిల్లాల చైతన్య యాత్రలో బాగంగా ఈ నెల 23వ తేదిన ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే చైతన్య యాత్రలో ఉద్యమకారులో మేధావులు, విద్యావేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు, ఉద్యమ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమై తిప్పాపూర్ బస్టాండు 10.45 గంటలకు చేరుకుని తెలంగాణ తల్లి విగ్రహం వరకు యాత్ర కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బొజ్జ కనుకయ్య, తిరుమల్‌గౌడ్, బొడ్డు రాములు, సావనపల్లి శ్రీనివాస్, వారాల దేవయ్య బుర్రి శంకరయ్య తదితరలు ఉన్నారు.